


నేడు కలెక్టర్ సిరి బాధ్యతల స్వీకరణ

- కర్నూలుకు చేరిన ఆమెకు జెసి, ఆర్‌డిఓ స్వాగతం



కలెక్టర్ సిరికి స్వాగతం పలుకుతున్న జెసి



కలెక్టర్ సిరికి స్వాగతం పలుకుతున్న ఆర్‌డిఓ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ ఎ.సిరి శుక్రవారం సాయంత్రం కర్నూలుకు చేరుకున్నారు. విజయవాడ నుండి నేరుగా ఓర్వకల్ విమానాశ్రయానికి చేరుకున్నారు. శనివారం ఉదయం జిల్లా డాక్టర్ ఎ.సిరి కలెక్టర్‌గా బాధ్యతలను చేపడతారు. అక్కడే విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఓలు సందీప్ కుమార్, భరత్ నాయక్ స్వాగతం పలికారు. అనంతరం కర్నూలు లోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి చేరుకున్నారు. కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ లు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై ఐక్య ఉద్యమం

- సిపిఎం నాయకులు - సీతారాం ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, రాముడు, తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ : ప్రజాస్వామ్యం, రాజ్యాంగ బద్ధ వ్యవస్థల స్వతంత్రత, లౌకిక భావాలను కలుషితం చేస్తున్న మతోన్మాద, కార్పొరేట్ బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఐక్యంగా ఉద్యమించాలని సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు కోరారు. కర్నూలు సుందరయ్య జంక్షన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్ అధ్యక్షతన ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, టి.రాముడు, ఎండి.ఆనంద్‌బాబు, నగరకార్యదర్శి వర్గసభ్యులు ఆర్.నరసింహులు మాట్లాడారు. 1952 ఆగస్టు 12న మద్రాసులో ఏచూరి జన్మించారన్నారు. తెలుగు రాష్ట్రాలలో చదువుకొనిఉన్నత చదువుల కోసం ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి పూర్తి చేశారన్నారు. సీతారాం ఏచూరి జెఎన్‌యు ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికయ్యారని, ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులుగా పనిచేసి 1975 ఎమర్జెన్సీలో అరెస్టయ్యారని తెలిపారు. ఇందిరాగాంధీ ప్రధాని హోదాలో పాల్గొన్న సభలో సీతారాం ఏచూరి పాల్గొని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ పై గళం విప్పి దేశవ్యాప్తంగా ఉన్న మేధావులను ఆకర్షించారన్నారు. సిపిఐఎం కేంద్ర కమిటీ సభ్యులుగా, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని తెలిపారు. రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యులుగా ఉత్తమ సేవలను అందించారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక భావాలను కాపాడుకోవాలని గట్టిగా నినదించిన ఆయన దేశంలో ప్రజాస్వామ్యం, సెక్యులరిజం ప్రమాదంలో ఉందని తెలిపారన్నారు. ఈనెల 3న ఉదయం 10 గంటలకు ఎస్ఎన్ ఫంక్షన్‌హాలులో జరిగే వర్తమాన రాజకీయాలు-సిపిఎం వైఖరి అనే అంశంపై జరిగే సదస్సును వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు జయప్రదం చేయాలని కోరారు.

ఓల్డ్ సిటీ సుర్జిత్ భవన్‌లో: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఓల్డ్ సిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో సుర్జిత్ భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ అధ్యక్షతన నివాళి అర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఇక్బాల్ హుస్సేన్ ,కెవి.సుబ్బయ్య, అబ్దుల్ దేశాయ్ మాట్లాడారు.సిపిఎం నాయకులు ఖలీలుల్లాబాషా ,రాంబాబు, అబ్బాస్, ఆకాష్ ,గౌస్ దానియల్ పాల్గొన్నారు.

ఎల్ఐసి కర్నూలు బ్రాంచ్ లో : కర్నూలు ఎల్ఐసి కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎస్ఐసి యూనియన్ సెక్రటరీ ఆర్.సునీయ కుమార్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి సిపిఎం అత్యున్నత నాయకుడని కొనియాడారు. వామపక్ష ఉద్యమ కాంతిఅని ప్రధాని నరేంద్ర మోడీ అభివర్ణించారన్నారు. ఏచూరితో సంప్రదింపుల ప్రక్రియను తాను పోగొట్టు కున్నానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాళి అర్పించారన్నారు. స్నేహశీలి, ప్రతిభాశాలి అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రత్యేకంగా వ్యాసం రాశారన్నారు. పలువురు నేతలు ఆయన సేవలను కొనియాడారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ మక్బూల్ అహ్మద్, కర్నూలు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కాంతారావు ,సంయుక్త కార్యదర్శి రమేష్ ,మహిళా నాయకులు అంబుజాక్షి సింగ్, ఏజెంట్ యూనియన్ లీడర్ గజేంద్ర రెడ్డి, డెవలప్మెంట్ ఆఫీసర్, యూనియన్ లీడర్ రమేష్,హెచ్ ఎం భాస్కర్, గని, ఉస్మాన్ భాష తదితరులుపాల్గొన్నారు.

గూడూరు: సిపిఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ గూడూరులో నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ ప్రాంతీయ కమిటీ సభ్యులు జె. మోహన్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. వారు సీతారాం సేవలను కొనియాడారు.

ఓర్వకల్లులో...

ఓర్వకల్లు కలెక్టరేట్ : సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి బి నాగన్న కార్యకర్తలను కోరారు. ఓర్వకల్లు మండల కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయం లో ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ



మాట్లాడుతున్న ఎల్ఐసి యూనియన్ నాయకులు సునియ కుమార్

అత్యాచారం కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన బాలికను ముద్దాయి వివాహం చేసుకుంటానని నమ్మించి 2018 డిసెంబర్ 14న కిడ్నాప్ చేసిలైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో ముద్దాయి సాకే రాజకుమార్ అలియాస్ పెద్దకు 20 యేళ్ల జైలు శిక్ష రూ.2.5 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా ఫోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి ఇ. రాజేంద్రబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. న్యాయస్థానం 20 మంది సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయిపై నేరం రుజువు కావటంతో జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో మిగతా నలుగురు ముద్దాయిలపై నేరం రుజువు కానందున వారిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పోక్సో కోర్టు పిపి సి.వి శ్రీనివాసులు వాదించారు.

బిఎస్ఎన్ఎల్ సేవల అభివృద్ధికి కృషి

- టెలికాం అడ్వయిజరీ కమిటీ రెండో సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బిఎస్ఎన్ఎల్ సేవల విస్తరణకు, అభివృద్ధికి కృషి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. శుక్రవారం బిఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా టెలికాం అడ్వైజరీ కమిటీ 2024-26 రెండేళ్లకాలానికి రెండవ సమావేశం కర్నూలు బిఎస్ఎన్ఎల్ భవన్‌లో నిర్వహించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చైర్మన్ గా వ్యవహరిస్తూ, కర్నూలు పార్లమెంటు పరిధిలో బిఎస్ఎన్ఎల్ సేవల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ పరిధిలో 22 కొత్త 4జి టవర్లకు 4జి స్యాచురేషన్ ప్రాజెక్టు కింద అనుమతి రావడానికి కేంద్ర టెలికాం సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో కృషి చేశామని తెలిపారు. నంద్యాల ఎంపీ నియోజకవర్గ పరిధిలో డాక్టర్ బైరెడ్డి శబరి 14 కొత్త 4జి టవర్లకు 4జి సాచురేషన్ ప్రాజెక్టు కింద అనుమతి రావడానికి కృషి చేశారని తెలిపారు. ఎంపీలు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సంస్థ మారుమూల గ్రామాలకు కూడా మొబైల్ , ఇంటర్నెట్ సేవలను విస్తరిస్తున్నదని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ రంగసంస్థ బిఎస్ఎన్ఎల్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. బిఎస్ఎన్ఎల్ పిజియం జి రమేష్ విజ్ఞప్తి మేరకు ఒరిస్సా రాష్ట్ర తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అన్ని గవర్నమెంట్ సంస్థలలో బిఎస్ఎన్ఎల్ సేవలను కచ్చితంగా వాడడానికి మార్గదర్శకాలు వచ్చేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మెంబర్ సెక్రటరీగా వ్యవహరించిన బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ మాట్లాడుతూ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఎంపీలు హాజరు అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కర్నూలు బిజినెస్ ఏరియాలో టెలికాం సేవల సమగ్ర నివేదికను వివరిస్తూ కర్నూలు , నంద్యాల జిల్లాలలో 36 కొత్త 4జి టవర్లకు అనుమతి మంజూరు చేయించినందుకు , 85 కొత్త 4జి టవర్లు పరిశీలనలో ఉండడానికి సహకరిస్తున్న కర్నూలు,నంద్యాల ఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు. డిజిఎం కె రాజేశ్వరరావు మాట్లాడుతూ గత టిఎసి సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రతి సమస్యకు ఏ ఏ పరిష్కారం చేశారో విపులంగా వివరించారు. నంద్యాల పార్లమెంటు నియోజక వర్గం నుంచి నియమించిన టెలికాం అడ్వైజరీ కమిటీ (టిఎసి) మెంబర్లు చింతిబోయిన శ్రీనివాసులు, ఆడిక మధు, కురువ రమేష్ , కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం నుండి నియమించిన టిఎసి మెంబర్లు, బత్తిని జీవన్ కుమార్, కురువ మల్లికార్జున రెడ్డి , పర్ల భాస్కర్, కాపా రాఘవేంద్ర రెడ్డి వినియోగదారుల సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఎజిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పిజిఎం రమేష్, తదితరులు

రోగ నిర్ధారణకు, చికిత్సకు పెథాలజీ కీలకం

-పరిశోధనలకు ప్రత్యేక రూ.10 కోట్లు
-ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఖచ్చితమైన రోగ నిర్ధారణకు సమర్ధవంతమైన చికిత్స ప్రణాళికల లో "పెథాలజీ కీలకం" అని కాన్ఫరెన్స్‌ల ద్వారా యువ వైద్యులు నూతన మెలకువలు తెలుసు కుంటారని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. వైద్య రంగంలో పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేకంగా రూ.10 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పాథాలజీ అండ్ మైక్రో బయాలజీ' (ఐఎపిఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల 'ఎపి పాథ్కాన్ 2025'ను ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్‌కు ఐఎపిఎం ప్రెసిడెంట్ డాక్టర్ నీరజమైరెడ్డి అధ్యక్షతన వహించారు.ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీ వైపు అడుగులు వేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వైద్యవిద్యా రంగంలో నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు ప్రవేశపెడు తున్నామన్నారు. అందుకు అనుగుణంగా పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతి మెడికల్ కళాశాలలో రీసెర్చ్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. రూ. 10 కోట్ల రూపాయలను పీజీల రిసెర్చ్ అక్టీవిటికి, మెడికల్ టీచర్స్‌కి రూ.2 లక్షలు, రూ.70 లక్షల యూజీ స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయిస్తున్నామన్నారు. హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జబ్బులకు వైద్యం అందించడంలో పథాలజీ విభాగం అందించే రిపోర్టులే కీలకమని తెలిపారు. యువ వైద్యులు నూతన ఆవిష్కరణను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. కెఎంసిఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ రోగులకు సర్జరీ చేయాలన్న వైద్యం అందించాలన్న పథాలజీ విభాగం వైద్యుల సహకారం తప్పనిసరి అని అన్నారు. ఏపీ పాథ్కాన్ ఆర్గనైజింగ్ ఛైర్మెన్ పథాలజీ విభాగపు అధిపతి డాక్టర్ బాలీశ్వరి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ కెఎంసిలో నిర్వహించడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ మూడు రోజుల కాన్ఫరెన్స్ కు రాష్ట్రస్థాయిలో వివిధ మెడికల్ కళాశాల నుంచి, ప్రముఖ సంస్థల నుంచి వచ్చిన సీనియర్ వైద్యులు కీలక అప్డేట్ లు తెలియజేస్తారన్నారు. పరిశోధన రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణ గురించి వివరిస్తారని తెలిపారు. రిటైర్డు విసి డాక్టర్ ఎవి కృష్ణమరాజు, ఐఎపిఎం సెక్రటరీ డాక్టర్ మారుతి, ఐఎపిఎం అబ్జర్వర్ డాక్టర్ శ్రీనివాసులు, ట్రెజరర్ డాక్టర్ కుమార్ రాజు, విభాగాదిపతి డాక్టర్ పివి. రమణబాబు, వివిధ కళాశాలల అంకాలజీ విభాగపు ప్రొఫెసర్లు అసోసియేట్లు రాజు, విభాగాదిపతి డాక్టర్ పివి. రమణ బాబు, అసోసియేట్ డాక్టర్ రేవతి వివిధ కళాశాలల అకాలజీ విభాగపు ప్రొఫెసర్లు అసోసియేట్లు, అసిస్టెంట్లు, పీజీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కులపతి చంద్రశేఖర్



గోడపత్రికను విడుదల చేస్తున్న కెఇ.కృష్ణమూర్తి, ఎంపీ, ఎమ్మెల్యేలు, తిక్కారెడ్డి

రాజవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం చెస్ టోర్నీ

గోడపత్రికను విడుదల చేసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మాజీ ఎంపిపి డి.రాజవర్ధన్‌రెడ్డి 48వ జయంతి సందర్భంగా అంతర్జాతీయ ఓపెన్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ - 2025 వాల్ పోస్టర్‌ను టిడిపి నేతలు శుక్రవారం ఆవిష్కరించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ డిప్యూటీ సిఎం కెఇ. కృష్ణమూర్తి, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కెఇ,శ్యాంబాబు, బొగుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, వహీద్‌బాష టిడిపి నాయకులు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, పలువురు నాయకులతో కలిసి శుక్రవారం విడుదల చేశారు. రాజవర్ధన్ రెడ్డి 48వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా స్థాయిలో తొలిసారిగా అంతర్జాతీయ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నారు. అఖిల భారత చెస్ సమాఖ్య, ఆంధ్రా చెస్ అసోసియేషన్, అఖిల కర్నూలు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐకాన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. కర్నూలు మండలం దుపాడు రైల్వే స్టేషన్ సమీపంలోని కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబర్ 16 నుంచి 17, టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు పెంచాలి

-సిఐటియు మండల కార్యదర్శి యం. రవిచంద్ర

ప్రజాశక్తి-పత్తికొండ..

పత్తికొండ పట్టణంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర గ్రామ పంచాయతీ సిఐటియు కార్మికుల ఆధ్వర్యంలో శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్యకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు పెంచాలని, జిఒ నెంబర్ 132, 680, 142 లను వెంటనే అమలు చేయాలని టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు ఈనెల 18న మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శన కార్యక్రమాలు, 25న విజయవాడలో మహాధర్నా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రామపంచాయతీ నాయకులు నరసన్న, సతీష్, పాముల రంగన్న, పెద్ద రంగన్న, ఆవుల రామాంజి, ధనలక్ష్మి, పెద్ద రంగమ్మ, ఆవుల రంగనాథు, ఈశ్వరయ్య, కె. ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అభివృద్ధికి సహకరించిన రంజిత్‌బాషా

-ఆత్మీయ వీడ్కోలు సభలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టర్‌గా పి.రంజిత్‌బాషా జిల్లా అభివృద్ధికి పలు చర్యలు తీసుకున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాసాకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి ,బొగ్గుల దస్తగిరి, కెఇ.శ్యాంబాబు, కెడిసిసిబి బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌గా రంజిత్‌బాషా అనేక చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా ను అభివృద్ధి పతంలో నడిపించేందుకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. బదిలీ అయిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ బదిలీపై వెళ్లినప్పటికీ జిల్లా అభివృద్ధిలో తన వంతు సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. తనకు సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజాసంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి టిజి. భరత్, ఎంపీ ఎమ్మెల్యేలు ఇతర అధికారులు కలెక్టర్ రంజిత్ భాషను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి జిల్లా సహాధ్యక్షుడు జి హేమంత్ కుమార్ తదితరులు ఘనంగా సన్మానించారు



రంజిత్‌బాషా ఆత్మీయ వీడ్కోలు సభలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్



మొక్కను అందజేస్తున్న గౌరుచరిత, బోకేను అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్

ప్రజాశక్తి-కోడుమూరు

ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి రవిప్రకాష్ దుకాణాదారులను హెచ్చరించారు. కోడుమూరు మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణదారులతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ వారితో మాట్లాడుతూ ప్రతి దుకాణంలో తప్పకుండా స్టాకు వివరాలు, ధరల పట్టికను బోర్డులో పొందుపరచాలని ఆదేశించారు. ఎక్స్‌ఫైరీ కెమికల్స్‌ను షాపులో ఉంచకూడదని, దుకాణంలో ఉన్నటువంటి సరుకు సంబంధించిన పత్రాలు కచ్చితంగా ఉండాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, వాటిపై రైతు సంతక తీసుకోవాలని, రైతు అనుమతి లేకుండా ఎటువంటి లింకు ప్రోడక్ట్ ఇవ్వకూడదన్నారు.

యాంత్రిక జీవనంలో ఉపశమనం కళలు

-ముగిసిన కళా ఉత్సవం వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మనిషి యాంత్రిక జీవనంలో మానసిక ఆనందానికి కళలు ఎంతో దోహదపడుతూ ఉపశమనం కలుగజేస్తాయని కర్నూలు డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆయుబ్ హుస్సేన్ అన్నారు. రెండు రోజులుగా డైట్ కళాశాలలో వైభవంగా నిర్వహించిన 'కళా ఉత్సవం -2025' వేడుకలు ఉమ్మడి జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు శుక్రవారం ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అయూబ్ హుస్సేన్ మాట్లాడుతూ మానవ జీవితంలో కలలు ఎంతో మేలు చేస్తాయన్నారు. నంద్యాల జిల్లా డిఇఒ పి.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కళలు మనసులోని భావాలు వ్యక్తం చేస్తాయన్నారు. సీనియర్ అధ్యాపకులు మువ్వా గోవింద్ మాట్లాడుతూ...కళలు సామాజిక చైతన్యంలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. బిజి.మధు ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయిలో విజేతలైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు మారుతీ పౌరోహితమ్, సురేష్, రఫిక్, కరుణామూర్తి, వనంరాజ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



-విద్యార్థులతో డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అయూబ్, గోవిందు, తదితరులు

ప్రథమ బహుమతి విజేతలు : పి.జశ్వంత్ రామ్ - డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఎంఎంసి హైస్కూల్, కర్నూలు (ఇంస్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలో). ఎం వెంకటలక్ష్మి - మాంటిసోరి సీనియర్ సెకండరీ స్కూల్ ఎ. క్యాంప్ కర్నూల్ (నత్యం), ఎం ఓంకార్ - డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం , దినేదేవరపాడు కర్నూల్ (ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్) ,సి రోహిణి-నారాయణ జూనియర్ కాలేజ్ కర్నూల్ (విజువల్ ఆర్ట్స్ సోలో) ,బి రోహిత్ -MINDS -MIRS కర్నూల్. (విజువల్ ఆర్ట్స్ సోలో)



మీడియాతో మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

ఎస్‌సిలు ఉన్నత స్థాయికి ఎదగాలి

-మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి


ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఎపి స్టేట్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. రాష్ట్రంలో ఎస్‌సిల సంక్షేమం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్విరామ కృషి చేస్తున్నారని అన్నారు. శుక్రవారం ఆమె కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరికి వినోదాలు, విహారయాత్రలతో కిక్కు లభిస్తే ముఖ్యమంత్రికి మాత్రం అభివృద్ధి, సంక్షేమం, పోలవరం అమరావతి నిర్మాణం తో లభిస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను మూడు ముక్కలుగా చేసి ఒక్క పైసా కేటాయించకుండా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఎస్‌సిల ఉన్నత స్థానాలకు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చొరవ చూపిస్తుందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో, గురుకులాల్లో విద్యార్థులకు ఎంతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని తమ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సుచి, శుభ్రతను పాటించేలా విద్యార్థుల ఆత్మ గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుందన్నారు. ఎస్‌సిలు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా, ఎన్నో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఎస్‌సిలలో మాల, మాదిగలు ఐక్యంగా ఉండాలని సూచించారు. మాదిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పోతురవి, టిడిపి సీనియర్ నాయకులు కెవి సుబ్బారెడ్డి, కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి , పలువురు ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి ఎస్‌సిసెల్ నాయకులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని పోలకల్ రెగ్యులర్ బీసీ స్కూలులో సుమారు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మమ్మ , ఉపాధ్యాయులు టి. పద్మజ, ఎం ధనలక్ష్మి, కెఇ.రామచంద్రరెడ్డి, జి.రాజేశ్వరి, జాన్సీ లక్ష్మి దేవి, పురందరాచారి, ఆర్ శ్రీనివాసులుకు సన్మానం చేపట్టారు. ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని ఇదే పాఠశాలలో బోధించిన నాణ్యమైన బోధనపై గ్రామస్తులు పలువురు కొనియాడారు. అనంతరం విద్యార్థులు మంచి స్థితిలో రాణించాలని సూచించారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జిడిపి నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి - గోనెగండ్ల


ప్రాజెక్టు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

గోనెగండ్లలోని గాజుల దిన్నె ప్రాజెక్టు నుంచి శుక్రవారం అధికారులు రెండు గేట్లను ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 377 మీటర్లు. గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటిమట్టం 376.60 మీటర్ల గరిష్ట మట్టానికి చేరుకుంది. ప్రాజెక్టు ఈఈ పాండురంగయ్య, డీఈ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, తహశీల్దార్ పి.రాజేశ్వరి, అధికారులు, సిబ్బంది జలహారతి ఇచ్చి రెండు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు 4, 5వ నెంబర్ గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి కిందికి సుమారు 2,500 క్యూసెక్కుల వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 14 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం డ్యామ్‌లోకి చేరుతున్నట్లు చెప్పారు. గేట్లను ఎత్తి నీటిని వదిలితే చూసేందుకు భారీ సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకోవడంతో సిఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ప్రాజెక్టు ఏఈ చిన్నఅలీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉగ్ర నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రచార యాత్రను జయప్రదం చేయండి'


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి జరిగే పోరాట ప్రచార యాత్రను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వై.రామాంజనేయులు కోరారు. శుక్రవారం కడివెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ఈశ్వర్ రెడ్డి, వై.రామాంజనేయులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యారంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఈనెల 15 నుంచి 19 వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి ప్రచార బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఎన్.మోహన్, కె.రాఘవేంద్ర రావు, జె.రవి ప్రకాష్, ఎం.రజిత, బి.నాగమణి, ఎల్.నాగరాజా రావు, బి.ప్రవీణ్ కుమార్, సి.శంకరప్ప, జి.వేణుగోపాల్, ఎం.శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రెహామాన్‌కు, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులు ఎం.ప్రకాశం, ప్రసంగి, రాజు, కృపాకరం, భీమేష్, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

మండల ఏర్పాటుకు కృషి చేయండి

- ఎంపీకి సభ్యుల వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ఎంపీ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

ఆదోని జిల్లాతో పాటు, మండలంలోని పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పెద్దహరివాణం సాధన కమిటీ సభ్యులు ఆదినారాయణ రెడ్డి, మెడికల్ నాగరాజ్, కుప్పలదొడ్డి గర్జప్ప, గురులింగ, రంగారెడ్డి, రంగస్వామి, హాల్వి లింగన్న కోరారు. శుక్రవారం గ్రామం నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా కర్నూలు చేరుకుని ఎంపీ బస్తిపాటి నాగరాజు స్వగృహంలో వినతిపత్రం అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ... ఆదోని జిల్లాతో పాటు పెద్దహరివాణం మండలం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జెసి నవ్యకు, మంత్రి టిజి.భరత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల సాధన కమిటీ సభ్యులు హనుమంతు, లింగన్న, భాస్కర్, మారెప్ప, సిద్దప్ప, వీరారెడ్డి, షేకప్ప, నరేష్, వీరేష్, హనవాల్ గోపాల స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ సరఫరా చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రేషన్‌ను సక్రమంగా సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. శుక్రవారం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో 15 ఏళ్ల నుంచి స్థానికంగానే రేషన్ సరఫరా చేస్తున్నారని, ఇటీవల 1, 2వ వార్డుల్లో కాకుండా డీలర్ తన సొంతిల్లు ఉన్న దొడ్డిగేరి ప్రాంతంలో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం 1, 2వ వార్డులోనే రేషన్ బియ్యం దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఎం సభ్యులు ఖాజా పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రాధాకృష్ణ

సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏచూరి జీవితం ప్రజా శ్రేయస్సు కోసం దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని దశ, దిశను మార్చారని తెలిపారు. దేశంలో బిజెపి మతోన్మాదాన్ని ఎదిరించడానికి ఇండియా వేదిక ఏర్పాటు చేయడంలో ఏచూరి కీలకపాత్ర పోషించారని చెప్పారు. చివరికి దేహాన్ని కూడా ప్రజలకు అంకితం చేసే విధంగా ఢిల్లీ మెడికల్ కళాశాలకు రీసెర్చ్ చేయడానికి ఇచ్చారని తెలిపారు. దేశంలోని బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు రాముడు, లక్ష్మినరసయ్య, రామేష్, కృష్ణ, రాజు, దావీదు, తిమన్న, రాజా రామేష్, ఇస్మాయిల్, ఖాజా, రాకేష్ పాల్గొన్నారు. **ఆలూరు**లోని జ్యోతిబసు భవనంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కెపి.నారాయణస్వామి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.అంజిబాబు, సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సిపిఎం ప్రాంతీయ నాయకులు కృష్ణ, మైనా, షాకీర్, విఠల్, ఈరన్న, ఐద్వా నాయకులు షేకున్‌బీ, రాధ, మహేశ్వరి, హమాలీ సంఘం నాయకులు వీరేష్, నాగరాజ్, పరశురాం, గోవిందు పాల్గొన్నారు.


ఆలూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

నిందితుని అప్పగించాలి

- రహదారిపై ఐదు గంటల పాటు బైఠాయింపు, ఆందోళన - వామపక్షాల మద్దతు
- డీఎస్పీ జోక్యంతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - దేవనకొండ

8 నెలల కుమారుని నీటి డ్రమ్ములో ముంచి హత్య చేసి, భార్యను విచక్షణ రహితంగా కొట్టిన నిందితుడు చాకలి నరేష్‌ను అప్పగించాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు. శుక్రవారం దేవనకొండ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పత్తికొండ, దేవనకొండ రహదారిపై 5 గంటల పాటు బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అంతకు ముందు నిందితుని ఇంటిని ముట్టడించారు. ఆందోళన విరమించాలని పత్తికొండ సిఐ జయన్న, సిఐ వంశీనాథ్, పోలీసు సిబ్బంది ఆందోళన కారులతో మాట్లాడినప్పటికీ విరమించ లేదు. ఆందోళన కారులు, పోలీసుల మధ్య కొద్దిసేపు తోపులాట చోటు చేసుకుంది. 'సిఐ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. ఆందోళన విరమించకపోవడంతో స్థానిక సిఐ సమాచారాన్ని డీఎస్పీకి చేరవేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య హుటాహుటినా ఆందోళన వద్దకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో, ఆందోళనకారులతో మాట్లాడారు. కొంతసేపు డీఎస్పీ మాటను కూడా లెక్క చేయకుండా ఆందోళన విరమించలేదు. అనంతరం డీఎస్పీ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిపిఎం, సిపిఐ నాయకులు వీరశేఖర్, యూసుఫ్ బాష, అశోక్, సూరి, నరసారావు, ఐద్వా నాయకులు జ్యోతి, ఎర్రమ్మ, జనసేన, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు.


దేవనకొండ రోడ్డుపై బైఠాయించిన కులుమాల గ్రామస్తులు

ప్రభుత్వాస్పత్రిపై ఆరోపణలు తగదు

- ఫేక్ ప్రచారానికి కేరాఫ్ వైసిపి
- వైసిపి తప్పిదం వల్లే పరికరాలు లేవు - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిపై బుట్టా రేణుక ఆరోపణలు చేయడం సరైంది కాదని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి హితవు పలికారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బీవీ నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఫేక్ ప్రచారానికి కేరాఫ్‌గా వైసిపి మారిందని, ఎమ్మిగనూరులో వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఆస్పత్రిలో సరైన పరికరాలు ఏర్పాటు చేయలేదని, ఇప్పుడు సరైన పరికరాలు, వైద్యులు లేరని బుట్టా రేణుక చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నాబార్డ్ నిధుల కింద టిడిపి హయాంలో 100 పడకల ఆస్పత్రికి నిధులు మంజూరయ్యాయని, కొత్త ఆస్పత్రిలో పరికరాలు మార్చటానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. క్రిటికల్ కేర్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, నేషనల్ హైవే రోడ్డు ఉంటేనే క్రిటికల్ కేర్ వస్తుందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రిలో డెలివరీలు చేయడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని, జుబేదా అనే మహిళ 5 కిలోల బిడ్డకు జన్మనిచ్చారని తెలిపారు. జనసేన ఇన్‌ఛార్జీ రేఖా గౌడ్, బిజెపి నాయకులు తొగట నరసింహులు, టిడిపి, పట్టణ, మండలాల అధ్యక్షులు కెటి.వెంకటేష్, ఖాసీం వలీ, తిరుపతయ్య నాయుడు, మహేష్, మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్య, టౌన్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, దామ నరసింహులు, దేవళ్ల చిన్న రాముడు, కలీముల్లా, వాల్మీకి రామకృష్ణ నాయుడు, వీరేంద్ర, కందనాతి కేశన్న, భార్గవ్, బేతాలు బడేసాబ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

నగరడోనలో డెంగీ కేసు నమోదు

- గ్రామంలో వైద్య శిబిరం, శానిటేషన్

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నగరడోన గ్రామంలో డెంగీ నమోదయింది. గ్రామానికి చెందిన వృద్ధుడు నరసింహయ్య శెట్టికి డెంగీ సోకిందని తేలడంతో శుక్రవారం చిప్పగిరి వైద్యాధికారి అఫ్రోజ్ జహాన్, సబ్ డివిజన్ మలేరియా ప్రత్యేక వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నగరడోన గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే సర్పంచి మల్లమ్మ ఆధ్వర్యంలో శానిటేషన్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో డాక్టర్ అఫ్రోజ్ జహాన్, మలేరియా వైద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నగరడోన గ్రామానికి చెందిన నరసింహయ్య శెట్టి 20 రోజుల నుంచి అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గురువారం మరోసారి రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ సోకినట్లు నిర్ధారణ కావడంతో జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తమై రక్త పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలుంటే స్థానిక హెల్త్ కేంద్రంలో కానీ, ప్రభుత్వాస్పత్రిలో కానీ పరీక్షించుకొని నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిహెచ్ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


శానిటేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, రాంజుల చెరువు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించాలని, అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలోనూ ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రజలకు నిరంతరం సమాచారం అందించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. వాగులు, వంకలు పొంగిపొర్లే పరిస్థితుల్లో వాహనాల రాకపోకలను నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాలు తగ్గే వరకు అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని సూచించారు.


రాంజల చెరువును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

వానొచ్చనంటే.. వరదొస్తది..!

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'వానొచ్చనంటే.. వరదొస్తది' అని ఒక సినీ గేయ కవి చెప్పారు. కానీ ఈ వరద వాగులు, వంకలు, నదుల్లో వస్తే చూడ్డానికి ఆహ్లాదకరంగా ఉంటుంది. వానొస్తే.. ఇక్కడ తహశీల్దార్ కార్యాలయంలో వరద వస్తోంది.


నీటిని తోడేస్తున్న సిబ్బంది

ఆదోని తహశీల్దార్ కార్యాలయం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో పట్టణంలో చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయంలోకి నీరు చేరుతోంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి తహశీల్దార్ కార్యాలయం మొత్తం జలదిగ్బంధంలోకి వెళ్లింది. ప్రజలకు సేవలు అందించాల్సిన తహశీల్దార్ కార్యాలయం జలదిగ్బంధనం కావడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన పట్టణ, గ్రామీణ ప్రజలు వెనుదిరిగారు. బ్రిటీష్ కాలం నాటి భవనం కావడంతో కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పైకప్పునకు కూడా చిల్లులు పడ్డాయి. వర్షమొస్తే నీరు చేరుతోంది. డిప్యూటీ తహశీల్దార్ బాబు స్థానిక విఆర్ఒ గదిలో విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి తహశీల్దార్ నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

'బసాపురం'కు వరద అంతరాయం

మండలంలోని బసాపురం గ్రామ వంకకు మరోసారి వరద వచ్చింది. శుక్రవారం వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. బసాపురం గ్రామానికి వెళ్లాల్సిన ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఇతరులను ఆదోని నుంచి వచ్చిన వారితో కలిసి ట్రాక్టర్ల సహాయంతో సురక్షితంగా చేర్చారు. ఇలాంటి పరిస్థితులు ప్రతిసారీ ఎదురవుతున్నందున వంక ఇరువైపులా చెట్లు తొలగించి, గ్రామానికి శాశ్వత పరిష్కారంగా కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ట్రాక్టర్‌లో పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయులు

సమయపాలన పాటించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - హొళగుంద

అధికారులు సమయపాలన పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు మండలంలోని ఎల్లార్తి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. డిఎల్‌పిఒ తిమ్మక్క, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ రెడ్డి, తహశీల్దార్ నిజాముద్దీన్, ఎంపిడిఒ విజయ లలిత పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించండి : ఎస్ఎఫ్ఐ

హొళగుందలో ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, సిఐటియు నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజ్, నవీన్, సతీష్ మాట్లాడారు. హొళగుందలోని పాఠశాలలో చదివే బాలుర కోసం 2015లో రూ.లక్షలు ఖర్చు చేసి ఎస్సీ బాలుర హాస్టల్ కోసం సొంత భవనం నిర్మించారని, అది ప్రారంభమయి రెండేళ్లు కూడా గడవకముందే మూతపడిందని తెలిపారు. హొళగుంద పాఠశాలకు చుట్టుపక్కల ఉన్న దాదాపు 10 గ్రామాల నుంచి విద్యార్థులు వస్తారని, ఇక్కడ నాలుగు మీడియాలు ఉన్నాయని చెప్పారు. హాస్టల్ ఉంటే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, వారి తల్లిదండ్రులు వలసలు వెళ్లినా హాస్టల్‌లో ఉండి చదువుకుంటారని తెలిపారు. కలెక్టర్, సబ్ కలెక్టర్ స్పందించి వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను పునఃప్రారంభించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సామ్యేల్, రాజ్, సునీల్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సహకారంతో నూతన బోర్లకు మోటార్లు, పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - గోనెగండ్ల


నూతన బోర్లకు బిగించిన మోటార్ల వద్ద టిడిపి నాయకులు

గోనెగండ్లలో వెలసిన శ్రీచింతలముని నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవంలో నీటి సమస్య రాకుండా ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి సహకారంతో మేజర్ సర్పంచి హైమావతి, చంద్రశేఖర్ దంపతులు నూతనంగా వేసిన బోర్లకు మోటార్లు, పైపులైన్, సపరేట్ వాల్ ఏర్పాటు చేశారు. బోర్లలో పుష్కలంగా నీరు వచ్చినందువలన దశమి ఉత్సవాలకు నీటి కష్టాలు తీరినట్లేనని శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. మైనారిటీ, వీవర్స్, చదువుల రామయ్య కాలనీ లాంటి గ్రామ శివారు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఎమ్మెల్యే, సర్పంచి చొరవ తీసుకొని ఉచిత వాటర్ ట్యాంకులు కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, గ్రామ అధ్యక్షులు మహాల్ రహంతుల్లా, సొసైటీ అధ్యక్షులు రామాంజనేయులు, ఎల్ఎల్‌సి వైస్ చైర్మన్ టమోటా హుస్సేన్, వైస్ సర్పంచి ఖాసీం వలీ, టౌన్ మాజీ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, వార్డు మెంబర్లు అక్బర్ వలీ, జిలాని బాష, నూర్ బాష, పోలకల్ వెంకటేశ్వర్లు, ఎన్‌వి.బాబు నాయుడు, కొత్తింటి ఫక్రుద్దీన్, బొగ్గు గోకారి పాల్గొన్నారు.

ఘనంగా ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు రాఘవేంద్ర సర్కిల్‌లో బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్, నాయకులు గోర్కల్ కృష్ణస్వామి, కురువ మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి, వడ్డే నారాయణ, రోగప్ప, బొజ్జప్ప పాల్గొన్నారు.

జ్యోతి అనాథాశ్రమానికి విరాళం : ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు జ్యోతి అనాథాశ్రమానికి రూ.5 వేల విరాళం అందజేశారు. మండలంలోని కాచాపురం గ్రామంలో ఉన్న జ్యోతి అనాథాశ్రమ నిర్వాహకులు ముత్తులక్ష్మికి నగదును అందజేశారు. వైసిపి నాయకులు జగన్నాథ్, శాంతిరాజు, సిద్ధయ్య, నరసన్న, మధుకుమార్, చందావలీ, రచ్చుమర్రి శ్రీను పాల్గొన్నారు.

వామపక్షాల ఆశాజ్యోతి ఏచూరి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

వామపక్షాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆస్పరి సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఈరన్న, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తరుణ్, నవీన్, గాదిలింగ, శీనప్ప పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులతో బస్సులు కిటకిట

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితం బస్సు ప్రయాణం కల్పించడంతో బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. గతంలో ఆటోల్లో ప్రయాణించే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కావడంతో బస్సులు సమయానికి రాకపోయినప్పటికీ బస్టాండ్‌లో వేచి చూస్తున్నారు. అరగంట, గంటకో బస్సు రావడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఆదోని బస్టాండ్‌లో కర్నూలు వెళ్లే ప్రతి బస్సు నిండిపోతోంది. ఆర్‌టిసి యాజమాన్యం మాత్రం మహిళా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపడంలో విఫలమవుతోంది. ఒక బస్సులో 50 మంది ప్రయాణించాల్సి ఉన్నప్పటికీ కర్నూలు, ఆస్పరి వెళ్లే బస్సుల్లో వంద మందికి పైగా ప్రయాణిస్తున్నారు. కెపాసిటీకి మించి బస్సులో ప్రయాణిస్తున్న చిన్న పిల్లలు, వృద్ధుల బాధలు వర్ణణాతీతం. ప్రస్తుతం రెండో శనివారం, ఆదివారం నేపథ్యంలో రెండు రోజులు సెలవు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఎక్కువగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆదోని ఆర్‌టిసి బస్టాండ్ మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది.


బస్సుల కోసం వేచి చూస్తున్న మహిళలు

జాబ్ మేళాలో 55 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 55 మంది నిరుద్యోగులు ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ... నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన జాబ్ మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. 148 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 55 మంది ఎంపికయ్యారని చెప్పారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో నీటిని తోడాలి : ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ పాఠశాలలో నీరు నిలిచి విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని, నీటిని తోడాలని ప్రధానోపాధ్యాయులు జుబేర్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఆవరణలో నిలిచి ఉండడంతో చిన్నారులు తరగతులకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోడకు రంధ్రం చేసి నీటిని బయట పంపాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఇంజనీరింగ్ అసిస్టెంట్ భువనను ఆదేశించారు.

పని భారం తగ్గించాలి : సచివాలయం ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - ఆస్పరి

కూటమి ప్రభుత్వం చేపట్టిన సర్వేలతో ఇబ్బంది పడుతున్నామని, పనిభారం తగ్గించాలని సచివాలయ ఉద్యోగులు శ్రీనివాస నాయక్, ప్రశాంత్, హేమంత్ కుమార్, షంషీర్, హర్షవర్ధన్ రెడ్డి, వరప్రసాద్, సునీత, సంగీత, మహేశ్వరి, దివ్య తేజ కోరారు. శుక్రవారం ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు నీలకంఠేశ్వర సింగ్, నాగరాజు, మల్లికార్జున, రమేష్, రాజశేఖర్, మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - హొళగుంద

బైక్‌ను బస్సు ఢీకొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందారు. మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన రంగస్వామి, మంగమ్మ దంపతుల ఏకైక కుమారుడు రంజిత్ కుమార్ (18) శుక్రవారం హొళగుందలో ఓ ఫొటో స్టూడియోలో పని చేసేందుకు వెళ్లాలని వచ్చి పెద్దహ్యాట క్రాస్ చేరుకున్నారు. సులువాయి గ్రామానికి చెందిన వ్యక్తి మోటార్ సైకిల్‌పై హొళగుందకు వెళ్తుండగా లిఫ్ట్ అడిగారు. ఆయన బైక్‌పై వెనుక కూర్చొని వెళ్తుండగా.. వెనక నుంచి వచ్చిన ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో కిందపడ్డారు. తీవ్ర గాయాలు కాగా వైద్యం నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ధ్వంసం...

- వరద ధాటికి కొట్టుకుపోయిన గ్రావెల్
- చిప్పగిరి, దౌల్తాపురం, నంచర్ల గ్రామాల ప్రజల ఇబ్బందులు
- మరమ్మతులు వేసి దారి కల్పించండి : గ్రామస్తులు

ప్రజాశక్తి - చిప్పగిరి

గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చిప్పగిరి, దౌల్తాపురం గ్రామాలకు వెళ్లే రహదారి మధ్యలో కల్వర్టు చుట్టూ ఉన్న గ్రావెల్ కోతకు గురై కొట్టుకుపోయింది. రహదారి లేకుండా ఛిన్నాభిన్నమైంది. దౌల్తాపురం రైతులు, ఇటు చిప్పగిరి రైతులు పొలాలకు వెళ్లాలంటే ఇదే ఏకైక మార్గం. పొలాల్లో పనులు చేసుకోవడానికి లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. తెగిపోయిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, తాత్కాలికంగా రెండు ట్రాక్టర్ల గ్రావెల్ వేసి చేతులు దులుపుకోవద్దని సంబంధిత కాంట్రాక్టర్‌ను రైతులు కోరుతున్నారు. నంచర్ల, దౌల్తాపురం గ్రామాల ప్రజలు బ్యాంకు పని నిమిత్తం, ప్రభుత్వ కార్యాలయంలో పనులు చేసుకోవడానికి ఈ రహదారి వెంటే రావాల్సి ఉంది. లేకపోతే గుంతకల్లుకు వచ్చి అటు నుంచి చిప్పగిరికి వస్తున్నారు. ఇలా చుట్టూ రావాలంటే దాదాపు 40 కిలోమీటర్లు అవుతుంది. ఇలా చుట్టూ లేకుండా నంచర్ల గ్రామం నుంచి చిప్పగిరికి చేరుకోవాలంటే 12 కిలోమీటర్లు పడుతుంది. ఈ ఇబ్బందులన్నీ తొలగిపోవాలంటే కొట్టుకుపోయిన కల్వర్టుకు త్వరగా మరమ్మతులు చేపట్టి రహదారిలో పోయేలా మార్గం సుగుమం చేయాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరుతున్నారు.


వరదకు ధ్వంసమైన కల్వర్టు

రోడ్డు వేస్తామని తవ్వి వదిలేశారు

-ప్రమాదాలు జరిగితే అధికారులదే బాధ్యత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వ్యవసాయ మార్కెట్ యార్డ్ వెనుక కొత్త రోడ్డు వేస్తామంటూ తవ్వి వదిలేసిన రోడ్డుపై ప్రజలు నరకం అనుభవిస్తున్నారని వెంటనే కమిషనర్ జోక్యం చేసుకొని కొత్త రోడ్డు వేయాలని సీతారామనగర్ కాలనీ ప్రతినిధులు ఏనుగుల పుల్లారెడ్డి, ఎన్.రవీంద్ర, ఎంవి.చలమారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం స్థానిక కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. వారు మాట్లాడుతూ రూ.66 లక్షలతో సిమెంట్ రోడ్డు వేస్తామని ఉన్న రోడ్డును తవ్వి రెండేళ్ళు గడుస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శించారు. బస్టాండ్ నుండి మంత్రి క్యాంప్ ఆఫీసుకు వెళ్లేందుకు ఇది చాలా దగ్గరగా ఉంటుందన్నారు. ఈ రోడ్డు దాదాపు 10 కాలనీల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఉద్దేశించిన ఈ రోడ్డు నిర్లక్ష్యాన్ని గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం నీటిలో గుంతలు కనిపించక లైట్లు వెలగక రోజు 10–15 మంది కింద పడుతున్నారని తెలిపారు. జరుగుతున్న ప్రమాదాలకు నగరపాలక సంస్థ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. స్పెషల్ పోలీస్ శాఖపై 30 ఏళ్లు పోరాడి సాధించుకున్న రోడ్డు స్థానికులకు ఉపయోగపడడం లేదన్నారు. ఇంటి పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నా.. మా ప్రాంతంపై ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రశ్నించారు. వెంటనే కమిషనర్ పర్యటించి రోడ్డును వేయించాలని కోరారు. ఈ పర్యటనలో నాగరాజు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, అనిల్, హరికృష్ణ, వర్మ, లక్షణ గౌడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి , తదితరులు

భవన నిర్మాణ కార్మికులు 15న చలో విజయవాడ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఓల్డ్ సిటీ గడియారం హాస్పిటల్ ఎదురుగా భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు తరపున నాగరాజు అధ్యక్షత వహించారు. భవన నిర్మాణ కార్మికులు ప్రధాన కార్యదర్శి ఎస్ ఖాజా పాషా, సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, ఎస్ఎండి .మూసా, చాంద్ బాషా మాట్లాడారు. టిడిపి అధికారం రాకముందు పాదయాత్ర సమయంలో కూటమి నాయకులు నారా లోకేష్, చంద్రబాబు నాయుడు ,పవన్ కళ్యాణ్ తాము అధికారంలో వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, తమ మేనిఫెస్టో రాసుకున్నారన్నారు. రాష్ట్రంలో 25 లక్షల పైగా భవన నిర్మాణ కార్మికులు నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతూ రూ.18 లక్షల పైగా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డ్ తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రాష్ట్రాన్ని భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయి. మన రాష్ట్రంలో కూడా ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో వివిధ పథకాలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫర్ బోర్డ్ ద్వారా అమలు అయ్యేవి రాష్ట్ర విడిపోయిన తర్వాత కూడా అనేక సంవత్సరాలు పాటు సంక్షేమ పథకాలు అమలు జరిపారు. వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు ఆపేసి , మెమో12 ,14 జారీ చేసిందని, రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో వేల కోట్ల రూపాయలు కార్మిక సంక్షేమ నిధులను ఇతర పథకాలకు వాడి దుర్వినియోగం చేశారన్నారు. ఫలితంగా సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. రాష్ట్రాల్లో కర్ణాటక ,హర్యానా, మహారాష్ట్ర కార్మికులు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయి. ఈనెల 15నచలో విజయవాడ రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి వేలాదిగా భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలన్నారు. శేషన్న, షేక్ షావలి, మల్కల్, వెంకటేశు , ఆదిలక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల నిరసన

14న పత్తికొండలో ఆటో యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :

సిఐటియు అనుబంధ సంఘం ఎపిఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ మహాసభలు ఈనెల 14న పత్తికొండలో నిర్వహించారు. ఈ మహాసభకు పెద్ద ఎత్తున ఆటో డ్రైవర్లు కదలి రావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎపిఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ కోరారు. కేంద్రరాష్ట్రం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై రానున్న కాలంలో పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ మహాసభలో ఆటో డ్రైవర్ పై పడుతున్న భారలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ప్రభుత్వం దసరా రోజు ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ.15000 వేలు ఇస్తామని ప్రకటించిందని, ఉచిత ప్రయాణం వల్ల నష్టపోతున్న డ్రైవర్లకు ఈ సహాయం ఎందుకు సరిపోదని సంవత్సరానికి రూ.30 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తికొండ మహాసభకు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

-రూ. 16 లక్షల విలువ చేసే 32 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

-కర్నూలు డిఎస్పి జె.బాబుప్రసాద్

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

రూ.16 లక్షల విలువ చేసే 32 ద్విచక్ర వాహనాలు దొంగలించిన నిందితున్ని కర్నూలు రెండవ పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కర్నూలు డిఎస్పి జె. బాబు ప్రసాద్, కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజారావు, ఎస్ఐలు సతీష్, మల్లికార్జున తో కలిసి కర్నూలు రెండవ పట్టణ పోలీసుస్టేషన్ లో నిందితుని వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం... కర్నూలు పట్టణంలోని భూపాల్ కాంప్లెక్స్ దగ్గర ఒక బైక్ దొంగలించారని కర్నూలు, లక్ష్మీనగర్ కు చెందిన నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కర్నూలు టు టౌన్ సిఐ , ఎస్సైలు, పోలీసు కానిస్టేబుల్స్ రవి కుమార్, శ్రీనివాసులు, మహేంద్రలు కలిసి ఒక స్పెషల్ టీమ్‌గా ఏర్పడి నిందితున్ని పట్టుకోవడాని పథకం వేశారు. అందిన సమాచారం మేరకు కర్నూలు– సుంకేశుల రోడ్డు లో ఉన్న రెండు వాగుల వద్ద శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గద్వాల పట్టణం, దౌడురాళ్ళ కాలనీకి చెందిన తెలుగు జయంత్ ఎ.జస్వంత్ ను అరెస్టు చేసి, అతని నుండి 32 బైక్ (హోండాషైన్ , హీరో హోండా, యూనికార్న్) లను రికవరీ చేశారు. వీటి విలువ రూ. 16 లక్షల వరకు ఉంటుంది. రికవరీ చేసిన బైక్ లు పలు పోలీసుస్టేషన్ పరిధులలో కూడా బైక్ దొంగతనాల పై కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీసుస్టేషన్లకు రికవరి చేసిన బైక్‌ల గురించిన సమాచారం అందిస్తాం. వాహనం ఇంజిన్ నెంబర్, బైక్ చాస్ నెంబర్ ద్వారా సంబధించిన బైక్ యజమానులకు బైక్‌లు అప్పగిస్తారు. కర్నూలు టౌన్ లోని పలు



జంక్షన్స్ , హాస్పిటల్స్ , రాత్రి ఇళ్ళ దగ్గర పార్కింగ్ చేసిన బైక్ లను నిందితుడు దొంగలించినట్లు గుర్తించాం. పలు పోలీస్టేషన్ పరిధులలో దొంగలించిన బైక్ లను కూడా రికవరీ చేయడం కర్నూలు టు టౌన్ సిఐని, టు టౌన్ సిబ్బందిని అభినందించారు. రికవరీ చేసిన బైక్ లను ఆయా పోలీసుస్టేషన్లలో నమోదైన బైక్ దొంగతనాల కేసుల ఆధారంగా వాటిని పంపించి డిస్పోజబుల్ చేస్తారు. సిసి కెమెరాల సహాయంతో ఈ కేసులను సులువుగా చేధించడానికి వీలయింది. బైక్ లు రికవరీ చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు.

నిందితుని నేపథ్యం:

నిందితుడు బైక్ ర్యాపిడో బుకింగ్ లో పని చేస్తూ ఉండేవాడు. ఈ బైక్ లను ఎక్కువగా కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలలో దొంగలించాడు. సులువుగా డబ్బులు సంపదించాలని మోటార్ బైక్ లను దొంగిలించడం వాటిని రూ. 10 వేలు, రూ. 5 వేలకు అమ్మడం చేస్తూ ఉండేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ ఉండేవాడు.


-విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న మంత్రి టిజి భరత్

అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాం

-ధర్వేశ్ ఖాద్రి మసీదును సందర్శించిన మంత్రి టిజి. భరత్

-విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అన్ని మతాలను తాను సమానంగా గౌరవిస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. నగరంలోని పదవ వార్డులో ఆధునికరించిన ధర్వేశ్ ఖాద్రి దర్గాను మంత్రి సందర్శించారు. స్థానిక నాయకులు మహబూబ్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మసీదులో విద్యను అభ్యసించే విద్యార్థులకు మంత్రి సైకిళ్లను అందజేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మసీదును ఆధునికరించిన నేపథ్యంలో మసీదు కమిటీ ప్రతినిధులను అభినందించారు. మంత్రి మాట్లాడుతూ కర్నూల్ నగరంలో కుల, మతాలకు అతీతంగా అందర్నీ కలుపుకొని పోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. అందరినీ కలుపుకొని పోతున్నా... కొందరు తమను కమ్యూనల్‌గా ప్రచారం చేస్తారని. అలా చెప్పిన వారి వ్యాపారాల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉంటారని చెప్పారు. తమ సంస్థలో అన్ని సామాజిక వర్గాల వారు ఉంటారన్న విషయాన్ని గుర్తు చేశారు. వక్ఫ్ బోర్డు కాంప్లెక్స్‌ను మరింత అభివద్ధి చేసి పేద ముస్లింలకు సహాయం చేసే విధంగా ముందుకు వెళ్తామని చెప్పారు. అనంతరం మసీదు కమిటీ ప్రతినిధి మహబూబ్ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంపా నాగేశ్వరరావు

విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి: ఐఐఎఫ్

ప్రజాశక్తి- సి బెళగల్

విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలని ఇన్‌పుట్ ఇంటర్ నేషనల్ ఫౌండేషన్ నిర్వాహకులు గంపా నాగేశ్వరావు , చైతన్య కారుడు కె.మహేంద్ర లు పేర్కొన్నారు. శుక్రవారం సి.బెళగల్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ చింతలయ్య సమక్షంలో పది, ఇంటర్ విద్యార్థులతో లక్ష్యసాధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్య దశలో క్రమశిక్షణతో పాటు వినయంతో మెలగాలని కౌమార దశ విద్యలో విజ్ఞానంతో కూడిన వివేకం అలవరచుకోవాలన్నారు. కిషోర దశలో అంటే ఇంటర్‌లో భవిష్యత్తులో స్థిర పడేందుకు నిర్దేశితమైన దిశగా విద్యలో రాణించి క్రిడల్లో ఔత్సహికత చాటాలన్నారు. యవ్వనదశలో నిజ జీవితంలో స్థిర పడుటకు నేర్పరిగా మంచి స్థితిలో ఏకాగ్రతతో మెలిగితే భవిష్యత్తు మీదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజశేఖరరెడ్డి, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరికి ఘననివాళి

ప్రజాశక్తి -కోడుమూరు

సిపిఎం పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కోడుమూరులో సిపిఎం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం ఆయన మొదటి వర్ధంతిని సుందరయ్య భవన్లో కోడుమూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కార్యదర్శి కె.రాజు, గఫూర్‌మియా మాట్లాడారు. సీతారాం ఏచూరి మృతి శ్రామిక ప్రజానీకానికి, సిపిఎంకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డయ్య, నాగరాజు, మునిస్వామి, రాఘవేంద్రరాజు, గంగాధర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు